# ప్రగతి 'దారులు'



కత్తెర్ల రోడ్డు పనులకు సంబంధించి సర్వే చేస్తున్న ఐటీడీఏ అధికారులు (ఫైల్)

- మండలంలో 3 బీటీ రోడ్లుకు రూ.8.80 కోట్లు
- బీటీ రోడ్లుగా మారనున్న మట్టి రోడ్లు
- ఎమ్మెల్యే చిన్నయ్య చొరవతో మెరుగైన రవాణా మార్గాలు
- దశాబ్దాల సమస్య తీరనుండడంతో ప్రజల సంతోషం

తాండూర్, అక్టోబర్ 29 : సమైక్య రాష్ట్రంలో తాండూర్ మండలంలోని మారుమూల గ్రామాలు అభివృద్ధికి ఆమడదూరంలో ఉన్నాయి. తాగు నీరు, కరెంటు, రహదారులు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. తెలంగాణ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మారుమూల గ్రామాలు, తండాలకు వెళ్లే రహదారులు, గ్రామ పంచాయతీలుగా ఏర్పాటైన తండాలకు రోడ్డు సదుపాయం కల్పించేందుకు పెద్ద ఎత్తున నిధులు కేటాయిస్తున్నది. పలు దఫాలుగా నిధులు కేటాయించగా, సీఎం కేసీఆర్ సహకారంతో బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య ఇప్పటికే చాలా గ్రామాలకు రోడ్లు ఏర్పాటు చేశారు. తాజాగా భారీ మొత్తంలో రోడ్లకు నిధులు కేటాయించారు. ఐటీడీఏ నిధులతో మండలంలో 11కిలో మీటర్ల రోడ్లను బీటీగా మార్చేందుకు రూ.8.80 కోట్లు కేటాయించారు. మండలంలోని మూడు రోడ్లు త్వరలో బీటీగా మారనున్నాయి.

### మూడు బీటీ రోడ్లు, గంపలపల్లి బ్రిడ్జి..

బెల్లంపల్లి నియోజకవర్గంలో ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య ఆధ్వర్యంలో తాండూర్ మండలానికి పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేశారు. మండలానికి ఇటీవలే రూ.2 కోట్లు విడుదల చేయగా, పనులు పూర్తయ్యాయి. ద్వారకాపూర్ పంచాయతీకి రూ.70 లక్షలు, కొత్తపల్లికి రూ.70 లక్షలు, కిష్టంపేటకు రూ. 40 లక్షల నిధులు విడుదల చేశారు. దీంతో ద్వారకాపూర్‌లో కాసిపేట అడ్డ రోడ్డు నుంచి ద్వారకాపూర్ వరకు.., కొత్తపల్లిలో తాండూర్ రోడ్డు నుంచి గ్రామం వరకు.., కిష్టంపేట జాతీయ రహదారి నుంచి గ్రామ పంచాయతీ వరకు బీటీ రోడ్లు నిర్మించడంతో ఆ రోడ్లు అద్దాల్లా మెరుస్తున్నాయి. రూ.20 లక్షలతో గంపలపల్లి వద్ద నిర్మించిన బ్రిడ్జి పనులు, పూర్తికావడంతో ప్రజలు సాఫీగా ప్రయాణం చేస్తున్నారు.

### కొనసాగుతున్న పనులు..

బెల్లంపల్లి మండలం చాకెపల్లి నుంచి తాండూర్ మండలం కాసిపేట గ్రామం వరకు, చాకెపల్లి నుంచి అచ్చలాపూర్ గ్రామం వరకు ఐటీడీఏ నిధులు రూ.2.30 కోట్లతో నూతన రోడ్డు పనులు, అచ్చలాపూర్ ఆర్అండ్‌బీ రోడ్డు నుంచి గంపలపల్లి మీదుగా అన్నారం వరకు రూ.2.70 కోట్లతో బీటీ రోడ్డు మరమ్మతులు కొనసాగుతున్నాయి.

### తాజాగా వచ్చిన నిధులు..

గ్రామీణ రోడ్లను బీటీగా మార్చేందుకు ఎమ్మెల్యే చిన్నయ్య చొరవతో ప్రభుత్వం, ఐటీడీఏ ద్వారా నిధులు మంజూరు చేసింది. ఇందులో కత్తెర్ల నుంచి జాతీయ రహదారి వరకు 2 కిలోమీటర్లకు రూ.1.60 కోట్లు, బోయపల్లి జాతీయ రహదారి నుంచి గోండుగూడెం గ్రామం మీదుగా బుగ్గగూడెం లింకు రోడ్డు వరకు 3 కిలోమీటర్లకు రూ.2.40 కోట్లు, అచ్చలాపూర్ నుంచి బెల్లంపల్లి మండలం చంద్రవెల్లి వరకు 6 కిలోమీటర్లకు రూ.4.80 కోట్లు మంజూరయ్యాయి.

### హామీ నిలబెట్టుకున్న ఎమ్మెల్యే..

గత ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య.. ఈ ఎన్నికల వరకు అన్ని గ్రామాలకు రోడ్లు వేయించి, మాట నిలబెట్టుకుంటున్నారు. మండలంలో ప్రధానంగా 6 మారుమూల గ్రామాల ప్రజలు దశాబ్దాలుగా తమకు రోడ్లు లేక ఇబ్బందులు పడుతున్నామని, వర్షాకాలం వచ్చిందంటే కష్టాలు వర్ణనాతీతమని ఆయా గ్రామాల ప్రజలు గత ఎన్నికల్లో ఎమ్మెల్యేకు విన్నవించుకున్నారు. ఉమ్మడి రాష్ట్రంలో నేతలు కనీసం పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే, తాను తప్పకుండా రోడ్లు, గంపలపల్లి బ్రిడ్జి పూర్తి చేస్తానని హామీ ఇచ్చారు. ఆ రోడ్లలో మూడు గ్రామల రోడ్లకు నిధులు మంజూరు చేసి, పనులు పూర్తి చేశారు. దీంతో ఆయా గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలుపుతున్నారు. మరో మూడు బీటీ రోడ్ల పనులు కొనసాగుతున్నాయి. అలాగే ప్రస్తుతం తాజాగా మరో మూడు రోడ్లకు నిధులు మంజూరు చేయించారు. దీంతో ఎన్నో ఏండ్లుగా ఆయా గ్రామాల ప్రజలు పడుతున్న తిప్పలు తప్పనున్నాయని సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

### సర్వే చేసిన ఐటీడీఏ అధికారులు..

మండలంలోని కత్తెర్ల గిరిజన గ్రామం నుంచి కన్నాల జాతీయ రహదారి వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి.. బోయపల్లి నుంచి బుగ్గ గుట్ట గ్రామం అడ్డరోడ్డు వరకు, అచ్చలాపూర్ నుంచి చంద్రవెల్లి రోడ్డు కోసం స్థానిక నాయకులు, ప్రజలు బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్యకు విన్నవించారు. దీంతో స్పందించిన ఆయన ఐటీడీఏ అధికారులకు ప్రతిపాదనలు పంపించారు. అధికారులు స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి సర్వే నిర్వహించి, ఎస్టిమేట్ తయారు చేసి, ఐటీడీఏ ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించారు. ప్రస్తుతం ఆ పనులు ఎమ్మెల్యే ప్రోత్సాహంతో మంజూరయ్యాయి. టెండర్ల ప్రక్రియ పూర్తికాగానే రోడ్డు పనులు చేపట్టనున్నట్లు అధికారులు పేర్కొన్నారు.



బీటీ రోడ్డుగా మారనున్న అచ్చలాపూర్-చంద్రవెల్లి రోడ్డు

### ఏండ్ల కట్టాలు తీరుతయ్..



మా గ్రామం నుంచి మండల కేంద్రానికి, నియోజకవర్గం, జిల్లా కేంద్రానికి పోవాలంటే చాలా ఇబ్బందుండేది. ఏండ్ల నుంచి కట్టాలు పడ్డం. గిప్పుడు రోడ్లు మంచిగైతయని తెలిసింది. మా బాధలు తీరుతయ్. మట్టి రోడ్డుపై నడిచి పోవుటానికి షానా తిప్పలు పడేటోళ్లం. మా స్థానిక నాయకులు ఎమ్మెల్యే సారుకు చెప్పగా, దుర్గం చిన్నయ్య మా ఊరికి వచ్చి రోడ్లను చూసిండు. బీటీ రోడ్డు మంజూరు చేయడం చాలా సంతోషంగా ఉంది. ప్రయాణానికి, బయటి ప్రాంతాలకు పోవడానికి సులభమైతది.

**- మండిగ వెంకటి, కత్తెర్ల, తాండూర్**

### దూర భారం తప్పింది..



ప్రముఖ పుణ్యక్షేత్రం బుగ్గ దేవాలయానికి వెళ్లడానికి, మా గ్రామాల ప్రజలకు దూర భారం తగ్గింది. దేవాలయం తాండూర్ మండల రెవెన్యూ పరిధిలోని శివారు భూముల్లోనే ఉన్నప్పటికీ బుగ్గ వెళ్లాంటే బెల్లంపల్లి మీదుగా పోవాల్సి వచ్చేది. రోడ్డు ఏర్పాటుతో తాండూర్, బెల్లంపల్లి మండలంలోని ప్రజలు బోయపల్లి జాతీయ రహదారి నుంచి గోండగూడెం మీదుగా 10 నిమిషాల్లోనే ఆలయానికి చేరుకుంటారు. ఈ నూతన బీటీ రోడ్డు పరిసర గ్రామాల ప్రజలకు రవాణా మార్గం కూడా ఇబ్బంది లేకుండా ఉంటుంది.

**- కుర్సెంగ అనంతరావు, గోండగూడెం**

### మాకు అత్యవసరమైన రోడ్డు..



అచ్చలాపూర్ చంద్రవెల్లి రోడ్డు మాకు చాలా అత్యవసరమైంది. నియోజకవర్గ కేంద్రం బెల్లంపల్లికి కేవలం 10 నిమిషాల్లో చేరుకోవచ్చు. ఇంతకు ముందు తాండూర్ మీదుగా బెల్లంపల్లికి 25 కిలోమీటర్లు వెళ్లాల్సి వచ్చేది. ఇప్పుడు ఆ బాధ తప్పింది. అత్యవసర సమయంలో అంబులెన్స్ కూడా 20 కిలోమీటర్ల దూర భారం తగ్గి కేవలం 5 నిమిషాల వ్యవధిలో మా గ్రామం చేరుకుంటుంది. దీంతో ప్రజలకు ఎంతో రక్షణగా ఉంటుంది. రోడ్డు నిర్మాణం కోసం నిధులు మంజూరు చేసిన ఎమ్మెల్యే సర్‌కు కృతజ్ఞతలు.

**- బామండ్లపెల్లి సంతోష్, అచ్చలాపూర్, తాండూర్**

# నస్పూర్.. సూపర్



నస్పూర్ ఫ్లడ్‌కాలనీలో నిర్మిస్తున్న సీసీ రోడ్డు

- డీఎంఎఫ్‌టీ నిధులు.. అభివృద్ధికి బాటలు
- మున్సిపాలిటీలో రూ.12 కోట్లతో పనులు
- అంతర్గత రోడ్లు, డ్రైనేజీలకు మహర్దశ



సీతారాంపల్లి ఇన్‌టెక్‌వెల్ వరకు కొనసాగుతున్న రోడ్డు వైండింగ్ పనులు

సీసీసీ నస్పూర్, అక్టోబర్ 29 : తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత అటు గ్రామాలు.., ఇటు పట్టణాల రూపురేఖలు మారుతున్నాయి. ఓ వైపు మౌళిక వసతులు.., మరో వైపు అనేక సంక్షేమ పథకాలు అందుతున్నాయి. ప్రభుత్వ పాలన ప్రజల చెంతకు చేరింది. అభివృద్ధి.., సంక్షేమం రెండు కళ్లలా ప్రభుత్వం ముందుకు సాగుతున్నది. అందులో భాగంగానే నస్పూర్ మున్సిపాలిటీ అభివృద్ధి పథంలో దూసుకుపోతున్నది. అందివచ్చిన అవకాశాలను ప్రణాళికాబద్ధంగా సద్వినియోగం చేసుకుంటున్నది. మంచిర్యాల జిల్లా కేంద్రానికి సమీపంలో ఉండడం.. పాలనాధికారి కార్యాలయం ఇక్కడికి రావడంతో పట్టణానికి డిమాండ్ పెరిగిపోయింది. పెద్ద ఎత్తున నిర్మాణాలు జరుగుతున్నాయి. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా పురపాలక సంఘం ప్రజలకు అన్ని సౌకర్యాలు కల్పించేందుకు కృషిచేస్తున్నది. ఇతర ప్రాంతాలకు పనులపై వెళ్లి, వచ్చిన వారు ఆశ్చర్యానికి గురయ్యేలా మారిపోయింది

### రూ.12 కోట్ల డీఎంఎఫ్‌టీ నిధులు..

నస్పూర్ మున్సిపాలిటీ విస్తీర్ణంలో పెద్దది. జిల్లాలోనే రెండో పెద్ద మున్సిపాలిటీ. 80వేల పైచిలుకు జనాభా. 62,670 మంది ఓటర్లు. ఇప్పటి వరకు ఇక్కడ సింగాపూర్, నస్పూర్, తాళ్లపల్లి, తీగల్‌పహాడ్ గ్రామ పంచాయతీలుగా కొనసాగాయి. ప్రభుత్వ ఆలోచనకు ప్రజలు మద్దతు పలకడంతో కొత్త మున్సిపాలిటీగా ఏర్పడి, అభివృద్ధి పథంలో దూసుకుపోతున్నది. ఈ మున్సిపాలిటీలో సగభాగం సింగరేణి ఆధీనంలో ఉండగా, అటు సింగరేణి నిధులు, ఇటు ప్రభుత్వ నిధులతో అభివృద్ధి సాగుతున్నది. ఎమ్మెల్యే దివాకర్‌రావు సహకారంతో స్థానిక ప్రజాప్రతినిధులు ప్రజలకు అవసమైన చోట పనులు చేపట్టేందుకు ప్రణాళికలు తయారు చేశారు. నిధులు మంజూరు చేయించారు. మున్సిపాలిటికి రూ.12కోట్ల డీఎంఎఫ్‌టీ( డిస్ట్రిక్ మినరల్ ఫండ్) నిధులు తీసుకువచ్చారు. మున్సిపల్ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో రోడ్లు, డ్రైనేజీలు, కల్వర్టులు, బ్రిడ్జీలు, కమ్యూనిటీ హాల్లు నిర్మిస్తున్నారు. ఇందులో మేజర్‌గా రూ.కోటితో సీతారాంపల్లి గ్రామ చౌరస్తా నుంచి గోదావరి పుష్కరఘాట్ వరకు రోడ్డు విస్తరణ పనులు చేపడుతున్నారు. ఇప్పటికే కొన్ని పనులు పూర్తికాగా, ఎన్నికల షెడ్యూల్ కంటే ముందే ఎమ్మెల్యే దివాకర్‌రావు పలు అభివృద్ధి పనులను ప్రారంభించడంతో ప్రస్తుతం ముమ్మరంగా సాగుతున్నాయి.

### పట్టణ అభివృద్ధే లక్ష్యంగా..



నస్పూర్ పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నాం. ఎమ్మెల్యే సహకారంతో నిధులు తీసుకువచ్చి, ప్రజలకు అన్ని రకాల మౌళిక సదుపాయాలను కల్పిస్తున్నం. ప్రజలు, పాలకవర్గం సభ్యుల సహకారంతో పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దుతున్నాం. మున్సిపాలిటీలో ఒక వైపు సింగరేణి నిధులు, మరోవైపు ప్రభుత్వ నిధులతో అభివృద్ధి జరుగుతున్నది. అందమైన బీటీ రోడ్లు, సీసీ రోడ్లు నిర్మించాం. శిథిలావస్థకు చేరుకున్న డ్రైనేజీలు, కొత్తగా కట్టాల్సిన చోట డ్రైనేజీలను నిర్మించాం.

**- ఈసంపల్లి ప్రభాకర్, చైర్మన్, నస్పూర్ మున్సిపల్**

### ఇబ్బందులు తొలగిపోతాయి..



గోదావరి వరకు ఉన్న చిన్న రోడ్డుతో గత కొన్నేండ్లుగా చాలా ఇబ్బందులు పడ్డాం. గ్రామస్తులకు సంబంధించిన వ్యవసాయ పొలాలు మొత్తం గోదావరి పరివాహక ప్రాంతంలో ఉన్నాయి. నిత్యం వ్యవసాయ పనులకు వెళ్లే రైతులు, స్నానాలు చేసేందుకు మున్సిపాలిటీతో పాటు వివిధ ప్రాంతాల నుంచి వచ్చే ప్రజలకు చాలా ఇబ్బందులుండేవి. ఇప్పుడు సీతారాంపల్లి నుంచి గోదావరి వరకు పెద్ద రోడ్డు ఏర్పాటు చేస్తుండడం సంతోషంగా ఉంది. రోడ్డు నిర్మాణం పూర్తయితే ఇబ్బందులు తొలగిపోతాయి.

**- కొట్టె దేవయ్య, రైతు, సీతారాంపల్లి**